స్కెచ్

# 'వెళ్ళొస్తాను'

'నీవాళ్ళెవరైనా నిన్ను చూడాలనుకునే వాళ్ళు ఉంటే చెప్పు'—అన్నజైలర్ ప్రశ్నకి సమాధానం వెంటనే దొరకలేదు సింహానికి—కాదు నరసింహానికి ...నారమ్మ జ్ఞాపకానికి వచ్చింది.

ఎవ్వరూలేరు—ఎవ్వరూ రారు—నారమ్మ కూడా రాదేమో...

అయినా ఎందుకో ఇష్టం లేక పోయినా నారమ్మ పేరు ఉచ్చరించాడు నరసింహం. నాలుగు రోజుల క్రిందట రావచ్చు రాక పోవచ్చు. ఎవరు వచ్చినా ఎవరు రాక పోయినా పరవాలేదు. ఎప్పుడో చచ్చి పోయిన నరసింహం...మరో ఇరవై నాలుగు గంటలలో నిజంగా చచ్చి పోతున్నాడు.

ఇంక ఉన్నది ఒకపగలు ...ఒక రాత్రి.

తెల్లవారింది. పగలు గడుస్తోంది రాత్రి గడిస్తే తెల్లవారక మునుపే నరసింహం కళ్ళు మూస్తాడు. అతని మెడను ఉరిత్రాడు కావలించుకుంటుంది అప్యాయంగా .... హత్తుకుని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. కళ్ళలోంచి గుడ్లు బయటికి వస్తాయి. ఒకే ఒక క్షణం...బాధలేని చావు...నిల్చున్న వాడు నిల్చున్నట్లుగా...ఎనిమిదడుగులలోతుకు... ధడక్ . మనే శబ్దంతో వెళ్తాడు, తల వాలి పోతుంది. ఉరిలో ఎంతిహాయి. కత్తులు లేవు కత్తి పోట్లు లేవు. రక్తపాతం లేదు. వేడి పచ్చి నెత్తురులేదు. ఎర్రరంగులేదు. వరి నీరసం చావు. ఇలాంటి చావులో సుఖం లేదు చేతకాని చావు.

పట్టపగలే సూర్యుణ్ణి ఎవరో కత్తితో పొడిచారు, రక్తం చిమ్ముతున్నది. కత్తి పోట్లతో సూర్యుడి శరీరం కన్పించడం లేదు. రక్తం వర్షధారంగా చిమ్ముతోంది. వేడిలో చల్లదనం. నెత్తురు చినుకులు వాడిగా బాకులల్లే భూమిని పొడుస్తున్నాయి. భూమిది ఉక్కు శరీరం. బాకు పోట్లు దిగడంలేదు. శబ్దం చేస్తున్నది మోరాయిస్తూ....

మనిషి శరీరం ఎంత మెత్తని...బాకు పోటు మెత్తగా శరీరంలోకి దూసుకు పోయెది. ఎదురు చెప్పకుండా ఎన్ని పోట్లయినా సులభంగా దిగిపోతయి.

ఇటీవల నరసింహం బాకు పోట్లకు గురైన సీతయ్య శరీరం తూట్లుపడి వేడి పచ్చి నెత్తురు చిమ్మింది. చిమ్ముతున్న నెత్తురు చూసి నరసింహం వికటాట్టహాసం చేశాడు. అప్పటికీ కసి తీరలేదు. పడిపోయిన సీతయ్యను కాలితో ఒక తన్ను తన్నాడు...సీతయ్య శవం కదిలింది. కాని లేవ లేదు. నరసింహానికి దాహం తీరలేదు. దాపునున్న తాటాకు పాకలోకివెళ్ళి దాహం తీర్చుకున్నాడు.

## 'పెంచాశా'

నరసింహం అంటే అందరికీ సింహస్వప్నమే ఆ ఊళ్ళో పోలీసులు కూడా భయపడ్తారు. చూసిన వాళ్ళుకూడా సాక్ష్యం చెప్పడానికి పూనుకోరు. సింహం కలలోకి వచ్చినా భయమే. అంతా అయిపోయి మాటు మణిగిన తరువాత పోలీసులు విచారణకు వస్తారు.

దాహం తీర్చుకున్న తరువాత సరాసరి పోలీసు స్టేషన్‌కు వెళ్ళి—బాకు విసిరేస్తూ 'ఇన్స్పెక్టరుగారూ ఇదిగో నే వచ్చాను ఆ సీతాయిగాణ్ణి చంపి నా చేతులకు బేడీలు వేయండి' అన్నాడు పోలీసువాళ్ళు భయపడుతూ, భయపడుతూ బేడీలు వేశారు. బేడీలు ఒక దాన్ని ఒకటి రాసుకునేట్లుశబ్దం చేయిస్తూ పెద్దగా నవ్వాడు నరసింహం. ఆ నవ్వుకు పోలీసు స్టేషన్ దద్దరిల్లి పోయింది.

నరసింహానికి శిక్ష పడినపుడు అందరిలాగా బాధపడలేదు. నేరం చేశాను. దానికి తగిన శిక్షపడింది. ఇందులో బాధపడేందుకేముంది అనుకున్నాడు అతని దృష్టిలో ఈ శిక్ష చాలా అల్పమైనది. ఎవరైనా తనను బాకుతో పొడచి రక్తం చిమిస్తే చాలా సంతోషించేవాడు అంత సాహసానికి ఎవ్వరూ పూనుకోలేదు. అదే అతని బాధ. దెబ్బకు దెబ్బ రక్తానికి రక్తం... నరసింహాన్ని ఎవరూ ఆ రకంగా శిక్షించ లేక పోయారు, ఈ మనో వ్యధతో చాలా కాలం బాధపడి—విసుగెత్తి పోలీసులకు తనంతటతాను లొంగి పోయాడు. ఇక లాభం లేదనుకుని.

ఒక సారి ఊళ్ళో పలుకుబడి ఉన్న పెద్దిరెడ్డిని బాకుతో పొడిచినపుడు—అది రహస్యంగా జరిగిపోయింది. పొలంనుండి తిరిగి వస్తున్నపుడు తను కాచేశాడు ఎవరి కోసమో చేశాడు ఈ పని. ఎవరో ఈ పని చేస్తే ఇంత ఇస్తామన్నారు పుచ్చుకుని బాకుకు పనిచెప్పాడు. నరసింహాన్ని కావలిసిన వాళ్ళు కావలసినట్టుగా ఉపయోగించుకున్నారు.

నరసింహం పేరు బయటకు రాలేదు. అతడు పట్టుబడలేదు. ఎవరికోసమోకొంత మందిని చావకొట్టి—చంపకుండా చెవులు మూసేవాడు.

ఉగ్ర నరసింహాన్ని తాటాకు పాకలోకి సీసాలు శాంతింప చేసేవి.

మీసాలు దువ్వుతూ నడి బజార్లో అంకమ్మ చెట్టు దగ్గర నిల్చుంటే నరసిహానికి ఎదురుగా ఎవరూ వచ్చేవారుకాదు.

ఈరోజే మా పొదుపు
కొనుగోలు స్కీములోచేరి
లాభంపొందండి !

ఆల్ ట్రాన్సిస్టర్ 3 బ్యాండ్స్
సెమీపోర్టబుల్ హేండిల్ మరియు
టెలిస్కోపిక్ ఏరియల్‌తో సహా
గ్యారంటెడ్ బెస్ట్ రిసెప్షన్
రూ. 12-50 మాత్రమే:

వివరములకు:
ఫోనోరమ సర్వీసెస్
జాంబాగ్, హైదరాబాదు

కత్తిపోటు కోసం ఎన్నో సార్లు ఎదురు చూశాడు తన మీద కత్తి కాదుగదా కర్రైనా ఎవరూ విసర్లేదు. రక్తపు చినుకులు బాకుపోట్లు నెత్తురు ధారగా కురుస్తోంది. విధి విరామం లేకుండా.

ఎదురు చూస్తున్న ముహూర్తం ఇంకా రావడం లేదు. క్షణం ఓ యుగంగా గడుస్తోంది. గడియారం ముల్లు నెమ్మదిగా కదుల్తోంది. కాలానికి కళ్ళెం వేసినట్లయింది. ఒక వైపు చినుకులు ఒక వైపు బరువులు నెమ్మదిగా చీమల్లే వెళ్తున్న పాములాంటి గడియారం ముళ్ళు చావుకూ బ్రతుక్కూ తేడా కన్పించడం లేదు నరసింహానికి.

తనేదో నేరం చేసినట్టు నేరానికి శిక్ష అనుభవిస్తున్నట్టు అనుకోడం లేదు నరసింహం. ప్రయాణంలో ఒక మజిలీ అయి మరో మజిలీకి వెళ్తున్నట్టుంది. ఒక స్టేషన్లోదిగి కొంత కాలం బలాదూరు తిరిగి మరో స్టేషనుకు వెళ్ళినట్టు.

జైలు భోజనం చాలా మందికి తృప్తిగా లేకపోయినా నరసింహానికి బాగానే ఉన్నది. ఆ వేళకు భోజనం చేశాడు మామూలుగా అతనిలో ఎలాంటి ఆందోళన కల్పించడం లేదు.

వర్షం తగ్గలేదు. కాలం జరగడంలేదు. నరసింహానికి ఆలోచనలు ఏవీ రావడం లేదు. అతని కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. అతని మెదడు వానలో తడుస్తున్నది. కోరికలు, ఆశయాలు, ఆందోళన, భయం, వణుకు, పశ్చాత్తాపం, నిద్ర, మెలుకవ, కోపం, అసూయ, అహంభావం, పిరికితనం, ధైర్యం, అసహ్యం, ప్రేమ, ఇవేవీ లేవు నరసింహానికి ఇప్పుడు. అతని మనసులో ఏం వుందో తెలియడంలేదు.

నరసింహం కోసం ఎవరో వచ్చారని కబురు వచ్చింది నరసింహం చూశాడు.

వానలోతడిసి తడుస్తూ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నారమ్మ వస్తున్నది.

'కబురందింది. చూసిపోదామని వచ్చాను...' అన్నది నారమ్మ నెమ్మదిగా.

వర్షంలో తడిసిన నారమ్మ వయసులో ఉన్నదే. తడిసిపోయిన చీరే. జాకెట్టూ ఒంటికి అంటిపెట్టుకుని శరీరపు నాజూకును వలకపోస్తున్నది. నారమ్మది బీద బ్రతుకు. భగవంతుడిచ్చిన అందమూ. వయసూ ఆమె ఆస్తి. తడి బట్టలలోని సౌందర్యం కొట్టవచ్చేట్టుగా ఉన్నది. జైల్లో అక్కడ ఉన్నవాళ్ళంతా ఆమె వైపే చూస్తున్నారు. విరాట్ రాజు కొలువుకు ఊరిబయట నుండి వస్తున్న కేశ సంస్కారం లేకుండా, మాసిన బట్టలతో ఎంత దాచుకున్నా దాగని అందంతో ఉన్న ద్రౌపదిలాఉంది నారమ్మ. ఆ నాడు ద్రౌపది వస్తుంటే ఆమె ఎవరో తెలియక ఆమె అందానికి ఆశ్చర్యపడుతూ ఊళ్ళో వాళ్ళంతా గుమ్మం దగ్గర నిల్చుని మరీ మరీ చూశారు.

నరసింహం మాట్లాడలేదు.

'నిన్ను ఊళ్ళో వాళ్ళందరూ కలసి మోసం చేశారు....' అన్నది నారమ్మ.

'నన్నా ... మోసమూ....' అన్నాడు నరసింహం.

'నేను నీ దాన్నయినపుడు మరోరు నన్ను కన్నెత్తి చూడడమే ఎవరికున్నె అంతదమ్ములు' అన్నది నరసమ్మ. 'మరి ఆ సీతాయ్‌గాడు' అని గొణుక్కున్నాడు. సీతాయి ఎరం.. అన్నదినారమ్మ

నరసింహం పళ్ళు కొరకలేదు కత్తి దుయ్యలేదు కత్తి లేదు. కళ్ళు ఎర్రపడలేదు.

'నిన్ను ఉసిగొల్పేరు ...' అన్నది నారమ్మ.

'సీతాయి నీ దగ్గరకు రాలేదా?'అన్నాడు నరసింహం.

'వణుకుతూ వచ్చాడు అల్లంతదూరంలోనే ఉన్నాడు. తుపుక్కున ఊసేను మొహంమీద....' నలుగురూ చేశారు. రభస అయింది...సీతాయి పరుగెత్తుతుంటే తరిమితరిమి...పట్టుకుని నీవు బాకు దూశావు....నెత్తురు చిమ్మింది...'

నరసింహం నారమ్మను చూస్తూనే ఉన్నాడు....

నీ మనసు నాకు తెలుసు మెత్తనిగుండె గలోడివి...అందరికీ తెలుసు పట్టపగలు పదిమందిలో పౌరుషం చూపించావు... అందరి ప్రయత్నం ఫలించింది...నరసింహం విరగడ అయిపోనాడన్నారు... నేను ఎన్నాళ్ళో ఏడ్చేను. ఏడ్చి ఏడ్చి ఇప్పుడు ఏడుపురావడం లేదు. 'ఈ రాత్రికి సుఖంగా నిద్రపో. తెల్లారితే ప్రయాణం కోడి కూసే వేళ.' అన్నది నారమ్మ.

నారమ్మలో కన్నీరు ఏ నాడో ఇంకి పోయింది. తడి బట్టలలోంచి నీటిచుక్కలు ఒక్కొక్కటే భూమ్మీద బరువుగా పడుతున్నాయి.

'మంచి పని చేశారు. మంచి మార్గం వెదికారు. నన్ను నడి బజార్లో ఏవరైనా చంపితే బాగుండేది. నా నెత్తురు నేను చూసుకుంటూ కళ్ళు మూసే వాణ్ణి. ఈ వెధవచావు నేను చావలేను' అన్నాడు నరసింహం చాలా సేపటికి నోట్లోంచి మాట పెకిల్చుకుని.

నారమ్మ వెనక్కు తిరిగి వెళ్ళిపోబోతున్నది. వస్తాను నరసింహా...నేనెప్పుడూ నీదాన్నే అంటూ నారమ్మ కదిలింది.

తడి బట్టలలోంచి కన్పిస్తున్న ఆమె పిఱుదలను ఆ కదలికను చూస్తూ నిల్చున్నాడు నరసింహం.

వెళ్ళొస్తాను నారమ్మా అన్నాడు. ఒకసారి వెనక్కు తిరిగి చూసి మళ్ళీ కదిలింది నారమ్మ.

ఏదో ఊరికి వెళ్తూ చెపుతున్న మాటల్లా ఉన్నాయి. నరసింహం వెళ్ళొస్తానన్నాడు. తెల్లారేలోపున ప్రయాణం. ★

అన్ని విధములైన డ్రిల్సు, గేట్సు, మొదలైన వెల్డింగ్ పనులకు, సరసమైన ధరలలో సకాలమునకు అందచేయుటకై ఈ క్రింది వారిని సంప్రదించండి.

సాయి వెల్డింగ్ వర్క్సు

2-1-586 నల్లకుంట,
యూనివర్సిటీ రోడ్.
హైదరాబాదు.